క్లుప్తంగా

సామాజిక, పర్యావరణ అంశాలపై అవగాహన



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఓక్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు

దుండిగల్: విద్యార్థులు సామాజిక సమస్యలను పరిష్కరించే దిశలో విలువైన జీవిత పాఠాలను నేర్చుకుంటున్నారని బౌరంపేట ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ అన్నారు. సామాజిక బాధ్యత నేపథ్యంలో విద్యార్థులు మూడు విభాగాలుగా విడిపోయి సామాజిక, పర్యావరణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పీరియడ్‌టి, న్యూట్రిషై ది నీడ్‌ఫుల్, ఎలియోస్‌లపై సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. టీమ్ సభ్యులు సహానా, షర్రా, అశిష్, గణేశ్ కేదార్, నేహ, తానిసి, వరుణి, సీఏఎస్ కోఆర్డినేటర్ ఫియోనా తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన కల్చరల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీదుర్గామాత మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా రాఘవులు, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, చైతన్య, సాయిగౌడ్, జల్దా లక్ష్మీనాథ్, నవీన్, తిమ్మయ్య, జగన్, విజయ్, ఎల్లయ్య, నిలగిరి తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహా పాదయాత్రకు తరలిన నేతలు

నిజాంపేట్: మందకృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు గురువారం తరలి వెళ్లారు. ఎర్రోళ్ల విష్ణు ఆధ్వర్యంలో ఎస్సీవర్గీకరణ చేపట్టాలని కోరుతూ హైదరాబాద్‌లోని బాలాపూర్ వరకు ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు సందే కార్తిక్, గువ్వల విజయ్, సత్తిగళ్ల శివ కుమార్, ఎర్రోళ్ల హరీష్, కావలి సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమానిపై చీటింగ్ కేసు నమోదు

గచ్చిబౌలి: ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమాని వెలగపూడి రఘు తేజపై వేర్వేరుగా రెండు చీటింగ్, బెదిరింపుల కేసులు గచ్చిబౌలి పీఎస్‌లో నమోదయ్యాయి. సీఐ జేమ్స్ బాబు తెలిపిన వివరాలిలా.. గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ కో ఆపరేటివ్ సొసైటీలో తేజ జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా భారీ ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సంవత్సరం క్రితం అనుమతులు లేకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్‌ను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. వచ్చిన లాభంలో 5 శాతం ఇస్తానని చెప్పడంతో ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ నిర్మాణ సమయంలో 2021లో గచ్చిబౌలిలో నివాసం ఉండే ఠాకూర్ ప్రసాద్ రూ.75 లక్షలు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బు అడగగా రూ.10 లక్షలు తిరిగి ఇచ్చారు. కళ్యాణ్ చక్రవర్తి అనే వ్యక్తి రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చానని వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. రఘు తేజ, అతని తండ్రి వెలగపూడి శ్రీనివాస్‌పై ఐపీసీ 406,420,506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ జేమ్స్ బాబు తెలిపారు.

29న జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు

బంజారాహిల్స్: తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు ఈ నెల 29న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన నోటీసును తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ నెల 11న జారీ చేసింది. ఇందులో భాగంగా గురువారం జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్ష పదవికి స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి పదవికి వల్లభనేని అనిల్‌కుమార్, కోశాధికారి పదవికి శేషగిరిరావు చిక్కడపల్లిలోని కార్మిక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. 2023-25 సంవత్సరాలకుగాను నూతన కార్యవర్గం ఎన్నిక కానుంది.

ఊళ్లకు వెళ్తున్నారా.. అయితే జాగ్రత్త!



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: దసరా సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని పేట్‌బషీరాబాద్ పోలీసులు సూచిస్తున్నారు. సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆటోలకు మైక్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు చేస్తున్నారు. ఊళ్లకు వెళ్లేవారు విలువైన నగదు, నగలు ఇంట్లో ఉంచకూడదని, బంధువుల ఇళ్లల్లో, బ్యాంక్‌లలో భద్రపర్చుకోవాలన్నారు. ఇంట్లో ఎవరో ఒకరు ఉంటే దొంగతనాలు జరిగే ఆస్కారం ఉండదని ప్రచారం చేస్తున్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.



ఆటోలకు మైక్,బ్యానర్ ఏర్పాటు చేసి భద్రతపై ప్రచారం చేస్తున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు

జనం పల్లెబాట

సుభాష్‌నగర్: బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో పట్టణ ప్రజలు పల్లెటూర్లకు పయనమవుతున్నారు. 44వ జాతీయ రహదారి సుచిత్ర, కొంపల్లి, నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని చింతల్, షాపూర్ నగర్, సూరారం, బాహదూర్‌పల్లి, గండి మైసమ్మ ప్రాంతాల నుంచి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.



సూరారంలో మెదక్ వైపు వెళ్తున్న పల్లె వెలుగు బస్సు ఎక్కేందుకు పోటెత్తిన ప్రయాణికులు

మద్యంపై నజర్

మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్

- ఏ-4 లైసెన్స్ హోల్డర్లు ఎన్నికల నియమావలిని పాటించాలి
- ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తే చర్యలు
- బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 62 మందిపై కేసు నమోదు
- 53మంది అరెస్టు.. 457 లీటర్ల లిక్కర్ స్వాధీనం
- 113మంది పాత నేరస్తుల బైండోవర్
- మేడ్చల్ ఎక్సైజ్ పరిధిలో 276 కేసులను నమోదు.. 175మంది అరెస్టు



కుత్బుల్లాపూర్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి చీప్ లిక్కర్ తీసుకువచ్చి పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే మాత్రం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని మేడ్చల్ ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ్ భాస్కర్ హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా కార్యాలయంలో బాలానగర్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, జిల్లా డీటీఎఫ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

◆ కర్ణాటక, గోవా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి గతంలో చీప్ లిక్కర్ కొనుగోలు చేసి తెలంగాణ ప్రాంతంలో విక్రయించే క్రమంలో పట్టుబడ్డారని తెలిపారు. ఇదే తరహాలో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా సరఫరా అవుతున్నట్లు సమాచారం ఉంటే తమకు చెప్పాలని పేర్కొన్నారు. ఎన్నికల నియమాలను పాటిస్తూ ఏ-4 లైసెన్స్ హోల్డర్లు ముందుకు సాగాలని తెలిపారు.

◆ మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో ఇప్పటి వరకు 276 కేసులను నమోదు చేసి 175 మందిని అరెస్టు చేశామన్నారు. బ్లాక్ బెల్లంతో పాటు 49కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని 44 మందిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

◆ హాషీష్ ఆయిల్ 1.19 కేజీలతో పాటు ఎండిఎంఏ ఆరు కిలోలు, నాన్ డ్యూటీ లిక్కర్ 10 కేసుల్లో 27 మందిని అరెస్టు చేసి 1937 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశామని తెలిపారు.

◆ ఎన్నికల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిని కట్టడి చేస్తూ ఇప్పటివరకు 62 కేసులు నమోదు చేశామన్నారు. 53 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 457 లీటర్ల లిక్కర్‌తో పాటు 80 బీర్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ఇదే విధంగా దాడులు కొనసాగిస్తామని హెచ్చరించారు

◆ మూడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 113



పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని బైండోవర్ చేశామని తెలిపారు. వీరిలో ప్రవర్తన మార్చుకొని ముగ్గురిని రిమాండ్‌కు తరలించామన్నారు.

వైన్స్ వద్ద ఒక్కొక్కరికి 6బాటిళ్లే ఇవ్వాలి..

◆ ఎన్నికల సమయంలో ఏ-4 లైసెన్స్ కలిగి ఉన్న దుకాణందారులు 24/7 సీసీ కెమెరాలు ఆన్‌లో ఉంచాలన్నారు. పర్మిట్ రూములు పర్మిషన్ ప్రకారం నడుపుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. ఒక్కొక్కరికి ఆరు బాటిల్స్ మాత్రమే ఇవ్వాలని, ఎవరైనా టోకెన్లు తీసుకొని వచ్చి మద్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిస్తే మాత్రం వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. దుకాణంలో ఉన్న మద్యం నిల్వల విషయంపై ఎప్పటికప్పుడు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 21సంవత్సరంలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని ఆదేశించారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే మాత్రం సీరియస్ గా ఉంటుందని మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ హెచ్చరించారు.

కుత్బుల్లాపూర్	- 8712658741
మేడ్చల్	- 8712658740
బాలానగర్	- 8712658739

నెంబర్లలో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

మద్యం,డబ్బు ప్రవాహాన్ని అడ్డుకుంటాం

దుండిగల్: ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం ప్రవాహాన్ని అడ్డుకునేందుకు పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. ప్రధానంగా రోడ్లపై చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అయితే ప్రధాన రోడ్లపై కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వాహనాలను మళ్లిస్తుండడంతో పోలీసులు సైతం తమ రూటు మార్చారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, గాగిల్లాపూర్, మల్లంపేట, బౌరంపేట, దుండిగల్ ప్రాంతాల్లోని గల్లీ రోడ్లపైనా తనిఖీలు చేస్తున్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు రూ.30 లక్షలను సీజ్ చేశారు. బాలానగర్ జోన్ డీసీపీ శబరీష్, దుండిగల్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న డీసీపీ శబరీష్

జంగ్ తెలంగాణ 2023

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం ఆయన గాజులరామారంలోని ఆక్సిజన్ పార్క్‌లో వాకర్స్‌ను కలిసి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వాకర్లు గతంలో మీ హయాంలో బాగుండే అని.. బీఆర్ఎస్ పాలనలో మాకు ఒరింగేదీ లేదని చెప్పడం గమనార్హం. శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తామన్నారు.



ఆక్సిజన్ పార్కులో వాకర్లను కలిసి మద్దతు కోరుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

ప్రజా సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

బీజేపీకే మద్దుతు ఇస్తాం: బస్తీవాసులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ సంజీవయ్య నగర్‌లో బీజేపీ నాయకుడు విజయ్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరయ్యారు. బస్తీవాసులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. బాబాయ్- అబ్బాయ్‌ల పాలనతో విసుగు చెందామని వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మద్దుతు ఇస్తామని బస్తీవాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వర్ రావు, అలివేలు, నాయకులు వీరేందర్ గుప్తా, కృష్ణ కుమార్ గుప్తా, రాజేశం, బాటి సాగర్, సత్యనారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు

సూరారం సీఐ వెంకటేశ్వర్‌రావు

సుభాష్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సూరారం సీఐ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే అక్రమంగా నడుస్తున్న బెల్టు షాపులపై దాడులు చేసి 50లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని 7గురిపై కేసులు నమోదు చేశామన్నారు. వాహనాల సోదాలు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 5



లక్షల 80 వేల రూపాయలను సీజ్ చేసామన్నారు. నేర చరిత్ర కలిగిన 52 మంది రౌడీషీటర్లను గుర్తించి బైండోవర్ చేసి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మిగతా వారిని గుర్తించి వారి కూడా కౌన్సిలింగ్ చేపడతామని తెలిపారు. నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



దూలపల్లిలోని దుర్గామాత ఆలయంలో జరిగిన పూజలో బూర్గుభావి సత్యనారాయణ



శ్రీమహాచండీగా గాజులరామారం చిత్తార్మదేవి



కుత్బుల్లాపూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అమ్మవార్ల ఆలయాలు, శ్రీదుర్గా మాత మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను మహాచండీగా, మహాలక్ష్మిలుగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



వెన్నెలగడ్డలో చిన్నారులకు కానుకలు అందిజేస్తున్న బండి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు

చిన్నారులకు కానుకలు

సుభాష్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం వెన్నెలగడ్డకు చెందిన బండి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు చిన్నారులకు కానుకలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది దసరా ఉత్సవాల సందర్భంగా చిన్నారులకు బహుమతులు అందజేస్తు వస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని యువకుడు ఆత్మహత్య



హనిమీరెడ్డి (ఫైల్)

దుండిగల్: ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు పెద్దలు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పాదార మండలం, ఇప్పలపల్లి గ్రామానికి చెందిన అల్లు పున్నంరెడ్డి కుటుంబం కొద్ది సంవత్సరాల కిత్రం నగరానికి వచ్చి మల్లంపేటలోని శ్రీబాలజీ లే అవుట్‌లో నివసిస్తోంది. పున్నంరెడ్డి కుమారుడు అల్లు హనిమీరెడ్డి(25) ఓ ఫైర్ సేఫ్టీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నగరానికి చెందిన ఓ యువతి, హనిమీరెడ్డి గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో విషయం తెలిసి ఇరు కుటుంబాల పెద్దలు ప్రేమ పెళ్లికి నిరాకరించడంలో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి తన గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్న హనిమీరెడ్డి గురువారం ఉదయం వరకు తలుపులు తెరవలేదు. కుటుంబ సభ్యులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో విబేధాలు లేవు

కుత్బుల్లాపూర్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీలో విబేధాలు లేవని.. ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేస్తామని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం ఆయన టికెట్ ఆశించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, శొంటిరెడ్డి పున్నారెడ్డి, జ్యోత్స్నారెడ్డి, సుమిత్రా జీవేందర్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి వారిని బుజ్జగించారు. అధిష్టానం నిర్ణయం మేరకు తాను ఎన్నికల్లో నిలబడ్డానన్నారు. వచ్చే ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. దీంతో వారు సానుకూలంగా స్పందించడంతో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న టికెట్ రగడు సద్దుమణిగి ప్రతిష్టంభన తొలిగినట్లేనని అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.



గాజులరామారంలో సొంటిరెడ్డి పున్నారెడ్డితో కలిసి అల్పాహారం చేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

సిబ్బంది లేరు.. ప్రజల ఎదురుచూపులు

కుత్బుల్లాపూర్: ఎన్నికల నేపథ్యంలో కార్యాలయంలో సిబ్బంది కనిపించకపోవడంతో సామాన్య ప్రజలు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. కుత్బుల్లాపూర్ మండల కార్యాలయంలో ఆదాయ, కుల, రెసిడెన్షియల్ సర్టిఫికెట్ల కోసం వెళ్లగా అక్కడ సిబ్బంది లేకపోవడంతో సర్కిల్-25 కార్యాలయానికి వచ్చి అధికారుల కోసం ఎదురు చూస్తూ కనిపించారు. గత వారం రోజులుగా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం తిరుగుతున్నామని.. మరొకరు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు ఎంక్వైరీకి రాలేదని... ఇంకొకరు డబల్ బెడ్ రూమ్ వచ్చినప్పటికీ తాము బీసీ అయితే ఎస్టీ అని వచ్చిందని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ సమాధానం చెప్పడం లేదని 'సాక్షి'తో వాపోయారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు బిజీబిజీగా ఉండగా సామాన్య మధ్యతరగతి పేద ప్రజలు మాత్రం అధికారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి తమ గోడును వెళ్లపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండల కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే వారికి సమాధానం చెబితే ఇలా తిరగకుండా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సర్కిల్ కార్యాలయం వద్ద వేచి ఉన్న జనం

బతుకమ్మ కుంటలో మురుగు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరధిలోని కూనా మహాలక్ష్మి నగర్‌లో ఉన్న బతుకమ్మకుంట పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎలక్షన్ కోడ్ ఉండటంతో ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. దీంతో ఎంగిపూల బతుకమ్మను మురుగు నీటిలోనే వదిలేశారు. బతుకమ్మ కుంటలోని మురుగు నీటి తొలగించాలని కోరుతున్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కొలన్ హన్మంత్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన నేతలను పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి స్వయంగా కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

ఆశించి భంగపడిన నేతలతో హన్మంత్‌రెడ్డి

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, కందాడి జ్యోత్స్నారెడ్డి, పోలీస్ సుమిత్రారెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. దీంతో వారు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడమే తమ ధ్యేయమన్నారు.

ఇంద్రసేనారెడ్డికి శుభాకాంక్షలు

దుండిగల్: బీజేపీ నాయకుడు నల్ల ఇంద్రసేనారెడ్డిని త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరాచారి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కుత్బుల్లాపూర్: త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డి గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి, పీసరి కృష్ణారెడ్డి తదితరులు శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.





కాంగ్రెస్‌ను వీడుతూ.. బీఆర్ఎస్‌లో చేరుతూ..

కాంగ్రెస్ ముఖ్య నేతల్లో మొదలైన కలవరం



బీఆర్ఎస్‌లో చేరిన సంపత్‌గౌడ్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతు తెలుపుతున్న కమ్మ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఝలక్ ఇస్తూనే ఉన్నారు. ఇప్పటికే మైనార్టీ వర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సుభాష్‌నగర్ డివిజన్ నుంచి పోటీ చేసిన సీనియర్ నాయకుడు బలరాంరెడ్డి, సతీష్‌గౌడ్, టీడీపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి దుర్గారావు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే వివేకానందుకు మద్దతు ప్రకటించి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాజస్థాన్ రాష్ట్ర మాలి సమాజం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వివేకానంద సమక్షంలో తమ మద్దతు తెలియజేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇదే క్రమంలో జీడిమెట్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారం రోజులుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతూ రావడంతో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల్లో కలవరం మొదలయ్యింది.

ఎమ్మెల్యేకు కమ్మ సంఘం మద్దతు..

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కమ్మ సంఘం నాయకులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతు తెలిపారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో నాయకులు బొడ్డు రవి, బొబ్బా రంగరావు, నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, కార్పొరేటర్లు రాఘవేంద్రరావు, విజయలక్ష్మి, రవికిరణ్, మాధవి, రాజేశ్వరి ఎమ్మెల్యేకు మద్దతు తెలిపారు.